2024 ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
సోమవారం 1 జనవరి 2024

ఎన్నో ఆశలు.. ఎన్నెన్నోఆకాంక్షలు 8లో..

8లో.. భక్తజన సంద్రమైన మల్లన్న జాతర

కొత్త జోష్



బై..బై..2023...స్వాగతం 2024

జిల్లాలో మిన్నంటిన నూతన సంవత్సర సంబరాలు

జగిత్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను జగిత్యాల జిల్లాలో ప్రజలు ఆదివారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. యేడాది చివరి రోజును ఘనంగా జరుపుకుంటూ నూతన సంవత్సరానికి స్వాగతం పలకడానికి జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాలతో పాటు మండల కేంద్రాలు, పల్లెలు సిద్ధమయ్యాయి. కొనుగోళ్లతో ప్రధాన మార్కెట్‌లు సందడిగా మారాయి. అర్ధరాత్రి సమయంలో వేడుకలు నిర్వహించుకోవడానికి ప్రజలు ముందుగానే ఏర్పాట్లు చేసుకున్నారు. జగిత్యాల పట్టణంతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎక్కడా చూసినా...యువత సంబరాల్లో మునిగి తేలింది. వైన్స్ షాపుల ముందు బారులు తీరారు. బార్లు, రెస్టారెట్లు కిక్కిరిసి పోయాయి. సాయంత్రం నుంచే శుభాకాంక్షలు తెలియజేసేందుకు పోటీ పడ్డారు. మహిళలు ఇంటి ముందు రంగవల్లులు వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. ఎక్కడికక్కడ యువత, విద్యార్థులు, యువజన, మహిళా సంఘాల సభ్యులు, కిట్ పార్టీల నిర్వాహకులు, ఉద్యోగులు కేకు కట్ చేస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. సెల్ ఫోన్లలో న్యూ ఇయర్ మెస్సెజ్‌లను పంపారు. పలు కాలనీల్లో డీజే సాంగులు, ఆటా పాటలతో హుషారుగా గడిపారు. గుంపులుగా ఏర్పడి కేకులు కట్ చేశారు. కాగా రాత్రి వేళలో యువత రోడ్లపై హల్ చల్ చేస్తూ ప్రమాదాలకు గురికాకుండా పోలీసులు గస్తీని ముమ్మరంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జగిత్యాల, మెట్‌పల్లి డీఎస్పీలు వెంకటస్వామి, రవీందర్ రెడ్డిల ఆద్వర్యంలో పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

బాస్కెట్ బాల్ క్రీడాకారిణికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సన్మానం

జగిత్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన చెన్నాడి సత్తిరెడ్డి కుమార్తె శరణ్య అను క్రీడాకారిణి ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో బాస్కెట్ బాల్ విభాగంలో రాష్ట్ర స్థాయికి టీంకు ఎంపిక కాగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి వేర్వేరు సందర్భాల్లో సన్మానించారు. పట్టణంలోని ఇందిరా భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో శరణ్యను జీవన్ రెడ్డి సత్కరించగా, పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శాలువతో సత్కరించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడానికి ఎంపిక కావడం పట్ల శరణ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 31: మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామంలో మల్లన్న స్వామి బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని యాదవులు, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బోనాల జాతర అంగరంగ వైభవం నిర్వహించారు. సర్పంచ్ బద్దం శేఖర్‌రెడ్డి హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు బోనం తలపై ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం మహిళలు బోనంతో ఆలయం చుట్టూ ప్రదిక్షణలు చేశారు.

మల్యాల: మండలంలోని మల్లెగుట్టపై ఉన్న మల్లన్న ఆలయంలో షష్ఠ ఉత్స వాల్లో భాగంగా ఆదివారం పట్నాలు వేశారు. మల్యాల, పెగడపల్లి, జగిత్యాల తదితర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మల్లెగుట్టపైకి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు.

పొలం వద్దనే రైతు ఆకస్మిక మృతి

రుద్రంగి, డిసెంబరు 31: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నంద్యాడపు బుచ్చిమల్లయ్య (68)అనే రైతు గుండెపోటుతో పొలం వద్దే ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యుల కళ్లెదుటే ఆకస్మికంగా మృతి చెందాడు. వరి నాట్లు వేసే పనులు చేస్తుండగా గుండెపోటు రావటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. మృతునికి భార్య నర్సవ్వ, కొడుకు తిరుపతి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రాజన్నసేవలో హైకోర్టు న్యాయమూర్తి



ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఏఈఓ శ్రీనివాస్

వేములవాడ, డిసెంబరు 31: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి వి భాస్కరరెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించగా, సహాయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ శ్రీ స్వామివారి ప్రసాదం అందజేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత, జూనియర్ సివిల్ జడ్జ్ ప్రవీణ్, ఆర్డీవో మధుసూదన్, జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, స్థానిక డీఎస్పీ నాగేం ద్రచారి, పట్టణ సీఐ కరుణాకర్, ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ సూపరింటెండెంట్ శంకర్ పాల్గొన్నారు.

యాసంగి పంటకు సాగునీరు

- కాకతీయ కాలువ నుంచి విడుదల చేసిన మంత్రి పొన్నం

తిమ్మాపూర్, డిసెంబరు 31: యాసంగి పంట సాగుకు ఆదివారం సాయంత్రం కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దిగువ మానేరు కింద 8.99లక్షల ఎకరాలకు యాసంగి పంటకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్ఎండీలో ప్రస్తుతం సుమారు 19 టీఎంసిల నీరు నిల్వ ఉందన్నారు. మిడ్ మానేరులో 23 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా రైతులకు యాసంగి పంటలకు విడుదల చేయనున్నట్లు తెలిపారు. భవిష్యతులో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తీసుకురానుందని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, ఎరువులు, విత్తనాల సరఫరా లాంటి అనేక సంక్షేమ పథకాలను రైతులకు తీసుకురానుందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, క్యాబినేట్లో తీసుకున్న నిర్ణయం మేరకే నీటిని విడుదల చేశామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కూడా ఆదేశించామని తెలిపారు. జిల్లాలోని 16మండలాల్లో ఇప్పటికే 4లక్షలకు పైగా అరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలనర్నారు. తరువాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. ఇప్పటికే మహిళలకు సంబంధించి ఆర్టీసి బస్సులో ఉచిత ప్రయాణానికి స్పందన ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడిన 48 గంటల నుంచే ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని కొనియడారు. డిసెంబరు 9 నుంచి 28వ తేది వరకు 6కోట్ల మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేశారని వివరించారు. ఇంకా ప్రజలకు ప్రయాణాల్లో ఇబ్బంది కలగకుండా ఇప్పటికే నూతనంగా బస్సులను తీసుకురావడం జరిగిందని అన్నారు. విడతల వారిగా 1080నూతన బస్సులు రానున్నట్లు తెలిపారు. అవి కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాలుష్య నివరణ కొసం మరో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను మరో రెండు మూడు నెలల్లో తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. తెలిపారు. అందులో 500 జంటనగరాలకు మరో 500 జిల్లాలకు వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో పాటు రాష్ట్రంలో ఉన్న 364 బస్ స్టేషన్‌లు, 97 బస్ డిపోలు, 11రీజియన్‌లను ఏప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.. అంతకు ముందు ఎల్ఎండీ గెస్ట్ హౌస్ వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి, ఈఎన్‌సీ శంకర్, ఎస్ఈ శివకుమార్, ఈఈ నాగా భూషణం, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ కనకయ్య, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడలో భక్తుల రద్దీ



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

వేములవాడ, డిసెంబరు 31: దక్షిణ కాశీ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మేడారం సమ్మక్క సారక్క జాతర సమీపిస్తున్న క్రమంలో ఆదివారం నాడు వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు తమ ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొని తరించారు. తొలుత ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకు న్నారు. భక్తుల రద్దీ కారణంగా లఘు దర్శనం అమలు చేయడంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుండి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. కళాభవన్ లో శ్రీ స్వామివారి నిత్య కళ్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం సైతం భక్తులతో క్రిక్కిరిసిపోయింది. వేలాది మంది భక్తులు బద్దిపోచమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తుల సంఖ్య భారీగా ఉండడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

గ్రామ పంచాయతీ ట్రాక్టర్ టైర్లు చోరీ

జమ్మికుంట రూరల్, డిసెంబరు 31: మండలం శాయంపేటలో గ్రామ పంచాయతీ కార్యాలయం ట్రాక్టర్ టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామంలో ఓ మహిళ మృత్యువాత పడింది. తొమ్మిదో రోజు స్నానాలు చేసేందుకు మంచినీళ్ల ట్యాంక్ కావాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి ఫోన్ చేశారు. దీంతో సిబ్బంది వాటర్ ట్యాంకర్ పంపించారు. స్నానాలు పూర్తి అయిన అనంతరం వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్యాంకర్ టైర్లు ఎత్తుకెళ్లారు. పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



టైర్లు చోరీ చేసిన వాటర్ ట్యాంకర్

ధర్మపురిలో మల్లన్న భక్తుల సందడి



ధర్మపురిలో స్నానాలు ఆచరిస్తున్న మల్లన్న భక్తులు

ధర్మపురి, డిసెంబరు 31: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం మల్లన్న భక్తుల సందడి నెలకొంది. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. షష్ఠి వారోత్సవాల సందర్భంగా క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులు నెత్తి మీద మల్లికార్జున విగ్రహాల పెట్టెను పెట్టుకుని త్రిశూలం చేత పట్టుకుని నది వద్దకు చేరుకున్నారు. అనంతరం గోదావరి నదిలో స్నానాలు చేశారు. అలాగే నదీ జలాలతో మల్లికార్జున విగ్రహాలను శుభ్రం చేశారు. నది వద్ద గల స్నానఘట్టాలు, ఇసుక మేటల పైన ప్రత్యేకంగా సైకత లింగాలు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు త్రిశూలం, ఒగ్గు డోలు చేత పట్టుకుని మెడలో పూల దండ వేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. పట్నాలు వేసిన మరునాడు వేములవాడ, కొమరవెల్లి, ఓదేల, ఐనవోలు ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకునేందుకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఎస్సై దత్తాత్రి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

ఆర్టీసీ బస్సు, వ్యాన్ ఢీ

● ఒకరి మృతి ● వెన్నంపల్లిలో విషాదం

● మరో నలుగురికి గాయాలు



ప్రేమ్‌కుమార్(ఫైల్)

రేగొండ, డిసెంబరు 31: ఆర్టీసీ బస్సును ఫ్లిప్‌కార్ట్ వ్యాను ఢీకొంది. దీంతో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు.బస్సు డ్రైవర్, కండక్టర్‌తోపాటు ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ సంఘటన భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొత్తపల్లి గ్రామ శివారు పరకాల-భూపాలపల్లి ప్రధాన రహదారిలో ఆదివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎస్సై మాధవ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హనుమకొండకు బయల్దేరింది. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి భూపాలపల్లికి వెళ్తున్న ఫ్లిప్‌కార్ట్ కార్గో వ్యాన్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొంది. దీంతో వ్యాన్ డ్రైవర్ ఈర్ల ప్రేమ్‌కుమార్ (28) కేబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. కొద్ది సేపు వరకు మృత్యువుతో పోరాడి చివరి శ్వాస విడిచాడు. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ బీరబోయిన రమేష్, కండక్టర్ కృష్ణతోపాటు ప్రయాణికులు శ్రీలత, కుమార్‌కు గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రేమ్ కుమార్ మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం అదే ఆస్పత్రికి పంపారు. మృతుడు ప్రేమ్‌కుమార్ పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామస్థుడు. అతడు అవివాహితుడు కాగా తండ్రి బక్కయ్య, సోదరుడు రాజేష్‌తో కలిసి జీవిస్తున్నాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కాల్వశ్రీరాంపూర్: భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో ఆర్‌టీసీ బస్సు, డీసీఎం వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన ఈర్ల ప్రేమ్‌కుమార్(26) అనే యువకుడు మృతిచెందిన సంఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది. ప్రేమ్ కుమార్ నాలుగేళ్లుగా కరీంనగర్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా రేగొండ మండలంలో జరిగిన ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు బక్కయ్య, భాగ్యల రోదనలు మిన్నంటాయి.

జీఎస్టీ నెపంతో ప్రజలపై అధిక భారం

జగిత్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పన్నుల సరళీకరణ నెపంతో జీఎస్టీ రూపంలో పరోక్షంగా వినియోగదారులపై పన్నుల భారం మోపుతుందని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఇందిరా భవన్‌లో చాంబర్ కామర్స్ ఆధ్వ ర్యం లో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ప్ర భుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారం తగ్గించాలని, చిరు వ్యాపారులకు ప్రోత్సహం అందించాలని డిమాండ్ చేశారు. క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 105 డాలర్లున్న సమయంలో లీటరు డీజిల్ రూ. 50, పెట్రోలు రూ. 70 ఉన్నదని, ప్రస్తుతం క్రూడాయిల్ ధర 85 డాలర్లు ఉంటే డీజిల్ ధర రూ. 100, పెట్రోలు ధర రూ. 110 ఉన్నదన్నారు. జగిత్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కంటాల శ్రీనివాస్, పలువురు కార్యవర్గ సభ్యులు, పాల్గొన్నారు.

గల్ఫ్ బోర్డు ఏర్పాటు కోసం మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి

జగిత్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు, ఎన్ఆర్ఐ పాలసీ రూపకల్పన గురించి రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి చట్టం చేయాలని కోరుతూ గల్ఫ్ కార్మిక సంక్షేమ సంఘం నాయకుల బృందం రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైద్రాబాద్‌లోని సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసి సమస్యలను విన్నవించారు. ఇందుకు మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించినట్లు గల్ఫ్ సంక్షేమ సంఘ నాయకులు మంద బీంరెడ్డి, నరేశ్ రెడ్డిలు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

మెట్‌పల్లి, డిసెంబరు, 31 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కల్వకుంట్ల సుజిత్‌రావు మెట్‌పల్లి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం మహా పడిపూజను నిర్వహించగా కేరళ తాంత్రియులు శ్రీసంజీవ నంభూద్రి గురు స్వామిచే ఘనంగా జరిపించారు. కోరుట్ల మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. గురుస్వాములు మంత్రి అంజయ్య, దోమ్మటి ప్రవీణ్, భరత్‌కుమార్, మారుతి, ఆలయ కమిటీ అధ్యక్షుడు కోట బుచ్చిగంగాధర్ పాల్గొన్నారు.

పేదవారికి సేవ చేయడం అభినందనీయం

మెట్‌పల్లి, డిసెంబరు, 31 : మెట్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్యనారాయణ దంపతుల కుమారుడు నితిన్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చారిట బుల్ ట్రస్ట్ పేరుతో పెద వారికి చేస్తున్న సేవలు అభినందనీయమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకంట్ల సంజయ్ అన్నారు. ట్రస్ట్ పేరు మీదుగా ప్రతి సంవసత్సరం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు దసరా పండుగకు అందించే నూతన దుస్తువులు ఎన్నికల కోడ్‌తో నిలిపివేసిన వాటిని ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. డాక్టర్ ఆనంద్‌బాబు, కౌన్సిలర్లు లంక గంగాధర్, అంగడి పురుషోత్తం, గంగాధర్ పాల్గొన్నారు.

నరసింహుని సన్నిధిలో మాజీ మంత్రి కొప్పుల పూజలు

ధర్మపురి, డిసెంబరు 31: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. మొదట ధ్వజ స్తంభం వద్ద ఆయన దర్శనం చేసుకున్నారు. ఆయన స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఆయన వెంట డీసీఎం ఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సంగి సత్యమ్మ ఉన్నారు. ధర్మపురి నరసింహ స్వామి దేవాలయాన్ని కరీంనగర్ జడ్పీ చైర్ పర్సన్ కనమల విజయ దంపతులు ఆదివారం సందర్శించారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా 'కస్తూరి'



కోరుట్ల, డిసెంబరు 31 : బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా కోరుట్ల పట్టణానికి చెందిన కస్తూరి లక్ష్మీనారాయణను నియ మిస్తూ ఆదివారం జిల్లా అధ్యక్షుడుపై డిపల్లి సత్యానా రాయణరావు నియామక పత్రం అందించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. తన నియామకానికి సహకారం అందించిన ఎంపీ అర్వింద్, జిల్లా అ ధ్యక్షుడు సత్య నారాయణరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ రావు, రుద్ర శ్రీనివాస్ బీజేపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నో ఆశలు.. ఎన్నెన్నో ఆకాంక్షలు

- 2024 కొత్త సంవత్సరానికి స్వాగతం
- కొత్త కలలతో లక్ష్యాల సాధనకు అడుగులేసే తరుణమిదే..



జగిత్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కాల గమనంలోకి కొత్త సంవత్సరం వచ్చేసింది. 2023కి ముగింపు పలికి 2024 సంవత్సరంలోకి ఎన్నో ఆశలు, ఆంకాంక్షలతో అడుగుపెట్టేశాం. నూతన సంవత్సరంలో కొంగొత్త కలలతో అనుకున్న లక్ష్యాల సాధనకు అడుగుల ప్రస్థానం ప్రారంభించాం. కొందరికి ఆనందాన్ని, మరి కొందరికి విషాదాన్ని మిగిల్చిన 2023 సంవత్సరానికి గుడ్ బై చెబుతూ..2024 సంవత్సరానికి జిల్లా ప్రజలు స్వాగతం పలుకుతున్నారు. కేకులు కట్ చేసి ఒకరి కొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు గడిచిన ఏడాది అనుభవాలు, కొత్త ఏడాది భవిష్యత్ ప్రణాళిక తదితర అంశాలపై 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్న అభిప్రాయాలు వారి మాటల్లోనే...

ప్రతీ కుటుంబం ఆనందంగా ఉండాలి

అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ధర్మపురి



జిల్లాలో ప్రతీ ఒక్కరూ సుఖ సంతోషాలతో వర్థిల్లాలి. ప్రతీ కుటుంబం ఆనందంగా ఉండాలి. సకాలంలో వర్షాలు కురవాలి. పాడి పంటలు అభి వృద్ధి చెందాలి. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలందరికి సంక్షేమ, అభి వృద్ధి కార్యక్రమాలు అందాలి. ఇందుకు అవసరమైన కృషి చేస్తాను.

ప్రజల మధ్యే ఉంటూ సేవలందిస్తా

తాటిపర్తి జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ, జగిత్యాల



నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ అవసరమైన సేవలు అందిస్తాను. రాష్ట్రంలోని ప్రజలందరూ వచ్చే యేడాది సుఖ సంతోషాలతో, భోగా భాగ్యాలతో, పిల్లా పాపలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాను. కాంగ్రెస్ సర్కారు హయాంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమ లు చేయడంలో నా వంతు భాగస్వామ్యం అందిస్తాను.

కేసీఆర్ ఆశలు, ఆశయాలు నెరవేరేలా కృషి

ఎల్ రమణ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, జగిత్యాల



మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ ఆశలు, ఆశయాలు జిల్లాలో సంపూర్ణంగా నెరవేరేలా అవసర మైన కృషిని చేస్తాను. జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేలా నా వంతు సహకారాలను ప్రభుత్వానికి అందిస్తాను. ప్రజల సం క్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కేసీఆర్ పనిచేశారు.

ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలి

దావ వసంత సురేశ్, జడ్పీ చైర్‌పర్సన్



ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆశిస్తున్నాను. వర్షాలు కు రిసి పంటలు పండి ప్రజలు సంతోషంగా జీవించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. అన్ని వర్గాల సహకారాలతో జిల్లాను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తాను.

ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలి

డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్యే, జగిత్యాల



జిల్లా ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నాను. ఈ యేడాది ఎన్నికల్లో జగిత్యాల ప్రజలు మరోమారు ఆశీర్వదించి గెలిపించడం సంతోషంగా ఉంది. కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగింది. తెలంగాణ వాసులతో పాటు దేశ, విదేశాలలో నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరూ శుభం కలగాలి.

ఆరోగ్య జిల్లాగా మార్చుదాం

కల్వకుంట్ల సంజయ్ కుమార్, ఎమ్మెల్యే, కోరుట్ల



కోరుట్ల సెగ్మెంట్‌లో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను వచ్చే కొత్తయేడాదిలో అందించాలని ఆశిస్తున్నాం. జిల్లాను ఆరోగ్య జిల్లాగా తీర్చి దిద్దడానికి కృషి చేద్దాము. ప్రస్తుత యేడాదిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా విజయం సాధించి ఎమ్మెల్యేగా గెలుపొందడం సంతృప్తినిచ్చింది.

కొత్త సంవత్సరంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాలి

షేక్ యాస్మిన్ బాషా, కలెక్టర్



జిల్లా ప్రజలు ఆకాంక్షలు కొత్త సంవత్సరంలో నెరవేరాల్సిన అవస రముంది. ప్రతీ ఒక్కరు సుఖ సంతోషాలతో భోగభాగ్యాలతో జీవించాలి. అ ర్హులందరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అం దాలి. ప్రతీ ఒక్కరూ అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి.

నేర రహిత సమాజం ఏర్పాటు కావాలి

సన్ ప్రీత్ సింగ్, ఎస్పీ



నూతన సంత్సరంలో నేర రహిత సమాజ నిర్మాణం ఏర్పాటు కావాలి. నేరాల నియంత్రణలో పౌరుల భాగస్వామ్యం మరింత అవసరం. ప్రతీ ఒక్కరు శాంతిభద్రతలను కాపాడడంలో పోలీసులకు సహక రించడం సా మాజిక బాధ్యతగా స్వీకరించాలి. కొత్త ఏడాదిలో ప్రజలందరికి మంచి జరగాలి.

కార్మిక సంఘాల ఏర్పాటులో ప్రభాకర్ కృషి గొప్పది

సీపీఐ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి

కోరుట్ల, డిసెంబరు 31 : కార్మిక సంఘాల ఏర్పాటులో కామ్రేడ్ సి. ప్రభాకర్ కృషి గొప్పదని సీపీఐ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో కామ్రేడ్ సి. ప్రభాకర్ 30వ వర్ధంతిలో చాడ వెంకట్ రెడ్డి జిల్లా నాయకులతో కలిసి పాల్గొన్నారు. అరుణ పతకాన్ని ఆవిష్కరించిన నాయకులు అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. జిల్లాలో బీడి పరిశ్రమలు నిలదొక్కుకోవడంలో ప్రభాకర్ పాత్ర కీలకమని దీనితో పాటు హమాలీ, ట్రాక్టర్ డ్రైవర్, మున్సిపల్ కార్మిక సంఘాలు ఏర్పాటు చేయడంలో ఆయన కృషి గొప్పదన్నారు. మధ్యాహ్న బోజన కార్మికుల సమస్యలను పరిష్కరించి వారి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్యవర్గం సమావేశం నిర్వహించి కార్మికుల సమస్యలపై చేయవలసిన ఆందోళనతో పాటు పలు అంశాలపై తీర్మానం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, నాయకులు ఆశోక్, విశ్వనాథం, సుతారి రాములు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట రెడ్డి

ఆరు గ్యారెంటీల్లో యువ వికాసం మరిచారు

ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్

జగిత్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మెనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో యువ వికాసంను అమలు చేయడానికి ప్రభుత్వం మరిచిపోయిందని ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జగిత్యాలకు చెందిన 71 మందికి కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. యువ వికాసం కార్యక్రమం ప్రకారం 10వ తరగతి నుంచి పీహెచ్‌డీ వరకు చదివే విద్యార్థులకు భృతి అందించాలని డిమాండ్ చేశారు. రూ. 4 వేలు నిరుద్యోగ భృతి అందించాల్సి ఉందన్నారు. దీంతో పాటుగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు 10వ తరగతి ఉత్తీర్ణులయితే రూ. 10 వేలు, ఇంటర్‌కు రూ. 20 వేలు, డిగ్రీ రూ. 25 వేలు, పీజీ ఉత్తీర్ణులయితే రూ. లక్ష, పీహెచ్‌డీకి రూ. 5 లక్షలు యువ వికాసంలో మ్యానీఫెస్టోలో ఉందని వివరించారు. ప్రతి మండలానికి గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ పంటకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ప్రచారం చేశారని, అమలు చేయడంలో జాప్యం వహిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత మ్యానిఫెస్టోను కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బాండ్ రాసి విద్యానగర్‌లోని రామాలయంలో దేవుని ముందు ఉండి పూజలు చేశారని గుర్తు చేశారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ అభయహస్త మ్యానీఫెస్టోలోని యువ వికాసంపై స్పష్టత ఇవ్వాలని యువత పక్షాన డిమాండ్ చేస్తున్నానన్నారు.

ప్రోటోకాల్ విషయంలో కక్ష సాదింపు రాజకీయాలకు కాంగ్రెస్ పాటుపడుతోందని విమర్శించారు. ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో రెండో సారి గెలిచానని, ప్రజల గుండెల్లో ఉన్నానని, ఫ్లెక్సీల్లో ఫోటోలు తనకు అవసరం లేదని స్పష్టం చేశారు. రాజకీయాలకతీతంగా జగిత్యాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపు నిచ్చారు. అభివృద్ధిలో అందరికి సహకరిస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, బీఆర్ఎస్ నాయకులు దావ సురేశ్, పలువురు నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రమైన మల్లన్న జాతర

స్వామివారికి బోనాలు సమర్పించి భక్తులు

గొల్లపల్లి, డిసెంబరు 31 : మండలంలోని మల్లన్న పేటలో జరుగుతున్న మల్లికార్జున స్వామి జాతర పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనంతో జనసంద్రమైంది. నలువైపుల సుమార్ కిలో మీటర్ల మేరా భక్తులతో ఆలయ పరిసర ప్రదేశాలు కిక్కిరిసిపోయింది. బెల్లం పానంకంతో వండిన వంటకంతో బోనాలను భక్తులు నెత్తిన పెట్టుకుని బగ్గు పూజారుల డమరుక నాదాల నడుమ ఆలయం చుట్టు బోనాలతో మహిళలు ప్రదక్షణ ను నిర్వహించి స్వామి వారి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిద్దంకి నర్సయ్య, ఎంపీటీసీ రాజన్న, ఉప సర్పంచ్ భేర కిషోర్, ఆలయ ఈవో విక్రం ప్రత్యే క పరవేక్షణ నిర్వహించి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. పోలీ సులు ఎలాంటి అవాంచనీయ సంఘటన చోటు చేసుకోండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

●జాతర మహోత్సవం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ప్రభుత్వవ విప్ లక్ష్మణ్ కుమార్ స్వామి వారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను జీవన్‌రెడ్డితో కలిసి సమర్పించారు. లక్ష్మణ్ కుమార్ తులాభారంతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పౌండర్ ట్రస్ట్ శాంతయ్య, వేదపండితులు రాజేందర్ శర్మ, కొండూరి రఘునందన్ శర్మ, రంగు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.



ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న అడ్లూరి, జీవన్‌రెడ్డి

సంక్షిప్త సమాచారం

జగిత్యాల: జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బీర్‌పూర్ మండలం మంగేళ శివారులో గల గోండుగూడెంను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ప్రకటించడానికి కృషి చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి పలువురు గ్రామస్థులు వినతిపత్రం అందించారు. గోండు గూడెంలో సుమారు 580 జనాభా ఉందని, 380 ఓటర్లున్నారని వివరించారు. నూతన గ్రామ పంచాయతీగా గోండు గూడెంను ప్రకటింపజేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరింపజేయడానికి సహకరిస్తానని తెలిపారు.

కోరుట్ల : రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో 2024 సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అసోసియేషన్ సభ్యులు పబ్బా శివానందం, గంటేడి రాజు మోహన్, నల్ల లక్ష్మీనారాయణ, ఎండి సైపోద్దిన్, లక్ష్మి కాంతం, రాజయ్య, మురళి, సయ్యద్, సాజిద్, అలీ, రాములు పాల్గొన్నారు.

మల్లాపూర్ : మండలంలోని సిర్పూర్ సొసైటీలోని సీఈవోగా పని చేసిన సమయంలో డబ్బులను సొంతానికి వాడుకొని చెల్లించక పోవడంతో ఖాతాదారుల ఫిర్యాదు మేరకు కొత్తకొండ పరమేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. సొసైటీలో ఉన్న సమయంలో రైతుల పేరు మీద రూ. 2.15కోట్లను తీసుకొని స్వంతానికి వాడుకున్నాడని ఆయనని సీఈవోగా తొలగించారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగా ఆయనను అదుపులోకి తీసుకొని మెట్‌పల్లి సీఐ లక్ష్మి నారాయణ ముందు హాజరు పరిచి నట్లు తెలిపారు.

మెట్‌పల్లి: మెట్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో పట్టణంలో ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నెంబర్ ప్లేట్ లేని వాహనాలను పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలి పారు. నెంబర్ ప్లేట్ లేని 25 వాహనాలను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. కోరుట్ల ఆర్టీవో అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

కొడిమ్యాల : జనవరి 1 నుంచి ఇంటింటా అయోధ్య రామ అక్షింతలను పంపిణీ చేయటానికి ఆదివారం మండలంలోని 24 గ్రామ పంచాయతీల వారిగా బాధ్యులకు అక్షింతలను అందించినట్లు రామభక్తులు తెలిపారు. ఆదివారం వారం మండల కేంద్రంలోని రామాలయం మండలంలోని పలు గ్రామాలకు అయోధ్య రామ అక్షింతలను పంపినట్లు వారు తెలిపారు.

కోరుట్ల రూరల్ : జనవరి 22న అయోధ్యలో ప్రతిష్ఠించనున్న సీతారాముల వారి విగ్రహ ప్రతిష్ఠాపనకు ప్రత్యేకంగా పూజించిన రాముల వారి అక్షంతలు ఆదివారం మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామానికి చేరుకున్నాయి. శ్రీరామ తీర్థ క్షేత ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో అక్షంతలు గ్రామానికి చేరుకోగా వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ, బీజే వైఎం నాయకులు స్వాగతం పలికారు. గ్రామంలోని అంజనేయ స్వామి దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. సర్పంచ్ తుకారాంగౌడ్, ఎంపీటీసీ సభ్యురాలు పియాంక - తుక్కారాం గౌడ్ విహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ, బీజేవైఎం, పాల్గొన్నారు.

మెట్‌పల్లి : పట్టణంలోని వెల్లుల్ల రోడ్డులోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా పుష్పోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఆలయం లోని స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, పుష్పోత్సం, హారతి వంటి తది తర పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, సరోజ దంపతులు పాల్గొని స్వామి వారికి పుష్పోత్సవాలతో అభిషేకం చేసి పూజలు జరిపి మొక్కులు చెల్లించారు.

రాయికల్ : మండలంలోని బోర్నపెల్లికి చెందిన బారతపు లక్ష్మీనర్సయ్యకు చెందిన పశువుల కొట్టం ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. సుమారు రూ.ఐదు లక్షలు ఆస్తి నష్టం జరి గినట్లు తెలిపారు.

మల్యాల : మండలంలోని తక్కల్లపల్లిలో ఆదివారం అయోధ్య రాముని అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. అక్షింతలు మల్యాల నుంచి గ్రామానికి చేరుకోగా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికారు.

●వరదకాలువకు త్వరలోనే నీటి విడుదల కానున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. వరదకాలువ నీటి ఆధారంగా సాగు చేస్తున్న ప్రాంతాల్లో కాలువ నీరు అడుగంటడంతో ఇటీవల రైతులు ఎమ్మెల్యేను కలిసి నీటి కోసం విన్నవించారు. నీరు లేక పంటలకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు.

దీంతో ఎమ్మెల్యే నీటి విడుదలకు సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ముత్యంపేట మాజీ సర్పంచ్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.